క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



దేవరుప్పుల: మండలంలోని చింతబాయితండాలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన కునుసోతు మధుకర్ కుటుంబానికి సేవాలాల్ మహరాజ్ ధర్మపరిరక్షణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, నిత్యావసర సామగ్రిని అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బానోత్ మహేందర్ నాయక్, సర్పంచ్ గేమానాయక్, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్, ట్రస్టు సభ్యులు వీరేష్, శ్రీను, వెంకట్, రాహుల్,నాగరాజు, సురేష్, విజయ్, నర్సింహరాము పాల్గొన్నారు.

పోచన్నపేటలో..



బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటకు చెందిన మానుపాటి సోమమ్మ ఇటీవల మృతి చెందాడు. కాగా సామాజిక కార్యకర్త పోతుల రాములు యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. నాయకులు కె. బాబు, రేణికుంట సత్యనారాయణ, నీల పాపయ్య, మంత్రి సిద్దులు, నర్సింహులు, బుడిగె రామచంద్రం పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిల్పూరు: లారీ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సాయిరాం లారీ యూనియన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ యువజన మండల నాయకుడు జక్కుల రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ యూత్ నాయకుడు గణగోని నవీన్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. దామెర రవి, రాజు, నరేష్, గణేష్, కుమార్, రంజిత్, శ్యాం పాల్గొన్నారు.

శివాలయానికి కోడె అప్పగింత



చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బండలగట్టు శివగిరి శివాయంలో సోమవారం ఆలయ నిర్మాణ దాత, శాశ్వత అర్చకుడు వేల్పుల లక్ష్మీగట్టయ్య అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు కోడెను అప్పగించారు.

పొలాల్లో వేలాడుతున్న 11 కేవీ వైర్లు



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో చేతికి అందే ఎత్తులో 11 కేవీ వైర్లు వేలాడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయపడుతున్నారు. గ్రామ సమీపంలో 20 మంది రైతులకు చెందిన వ్యవసాయభూములు ఉన్నాయి. ఇటీవల గాలి దుమారానికి 11 కేవీ వైర్లు లూజు అయి వేలాడుతున్నాయని, దీంతో పాటు కొన్ని స్తంభాలు విరిగేలా ఉండటంతో సంబంధిత ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. కేవలం అదనంగా ఒక్క మిడిల్ పోల్ వేస్తే సమస్య తీరిపోతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని రైతులు నరేందర్, కొంరయ్య, శంబయ్య, రాజు, రాజయ్య అన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

రఘునాథపల్లి: నిడిగొండ గ్రామానికి చెందిన మాసాన్‌పల్లి పుల్లాజీ(59) అనే రైతు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిడిగొండకు చెందిన పుల్లాజి ఈనెల 23న తన వ్యవసాయ క్షేత్రం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో పుల్లాజీకి తీవ్ర గాయాలు కాగా స్థానికులు గుర్తించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన డీసీఎం డ్రైవర్ వేల్పుల యాకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడకండ్ల: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



జనగామ రూరల్: బైబిల్‌తో చిన్నారులు



బచ్చన్నపేట చర్చిలో..



లింగాలఘణపురం: నెల్లుట్ల జెరోం మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో..



అంబరాన్నంటిన క్రిస్మస్ సంబురాలు

ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు భారీగా చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏసు చూపిన శాంతి మార్గాన్ని ప్రజలు ఆచరించి సుఖ శాంతులతో జీవనం సాగించాలని ఫాదర్లు కోరారు. కాగా, పలువురు దాతలు పేదలకు దుస్తులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పాస్టర్లు, ఫాదర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పుల: ధరావత్‌తండాలో కానుకలు అందజేస్తున్న పాస్టర్ భద్రుపాల్



నర్మెట: వృద్ధులకు వస్త్రాలు అందజేస్తున్న దయామని వెలంగిని దంపతులు



ప్రార్థనలో మహిళలు



నర్మెట: గుంటూర్‌పల్లి చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



బచ్చన్నపేట: కట్కూర్ చర్చిలో..



చిల్పూరు: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సెనెర్జియా గ్రూప్ చైర్మన్ జీడి జాన్



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



బైబిల్‌తో చర్చికి వస్తున్న యువతులు



చిల్పూరు: మాట్లాడుతున్న సుదర్శన్



పాలకుర్తిలో ..



స్టేషన్‌ఘన్‌పూర్: జనసేన ఆధ్వర్యంలో..

వారోత్సవాలను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: నేటి నుంచి జరగనున్న సీపీఐ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ కోరారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో సీపీఐ ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ 99వ వ్యవస్థాపక వారోత్సవాల సందర్భంగా ఊరురా జెండావిష్కరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలే ఊపిరిగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాణ నిలుస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పడుతుందన్నారు. నేడు (మంగళవారం) నిర్వహించనున్న సీపీఐ వ్యవస్థాపక దినోత్సవంలో కార్యకర్తలతో పాటు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు రడపాక సత్తయ్య, తాడెం వెంకటయ్య, మహేష్, రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జువారి రమేశ్

ప్రత్యేక పూజలు

జనగామ రూరల్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నీలిమ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని చెన్నకేశవాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు చెంచారపు పల్లవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే పట్టణంలోని రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు తిప్పారపువిజయ్‌కుమార్, శ్రీశైలం, రాజు, ప్రవీణ్‌కుమార్, సతీష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న మహిళలు

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అజయ్

రఘునాథపల్లి: మండల కేంద్రంలో జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామిని ఊరేగించారు. ముందుగా జెడ్పీటీసీ స్వగృహంలో వేదపండితుల మంత్రోచ్చారణాలు అయ్యప్పమాలదారుల శరణుగోషలతో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక వాహనం ద్వారా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో భారీ ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపు సందర్భంగా మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విప్‌ను కలిసిన నాయకులు



బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను చేర్యాల, బచ్చన్నపేట, మద్దూరు మండలాల కురుమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఐలయ్యకు పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ పదవిని కురుమలకు కేటాయించాలని కోరారు. నాయకులు శెవల్ల రాజయ్య, జంగిలి యాదగిరి, మీస సత్యనారాయణ, ఈరి భూమయ్య, అందె అశోక్, బీరయ్య, నాని, బాబు, సూర్న శ్రీకాంత్, చిగుళ్ల రాములు, ఏగుర్ల ఎల్లయ్య, బండారి కనుకయ్య, సిద్దులు, నంగి కనుకయ్య, తీగుళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి అత్తాకోడళ్ల మొక్కులు



దేవరుప్పుల: ఏడు కొండల వాడా వెంకట రమణా.. కోర్కెలు తీర్చిన తిరుపతి వెంకన్నా అంటూ.. అత్తా కోడళ్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సోమవారం తిరుపతి గుట్టపైకి మెట్లపై నుంచి కాలినడక వెళ్లారు. అనంతరం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఏసుక్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక నిర్మలమాత దేవాలయంలో నిర్వహించిన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య సోమవారం హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచశాంతి, సంక్షేమం, లోక కల్యాణం కోసం, లోక పాపముల పరిరక్షణ కోసం యేసు క్రీస్తు జన్మించారన్నారు. ఏసుప్రభు జన్మించిన రోజు క్రిస్మస్ అని, శిలువపై చనిపోయిన రోజు గుడ్‌ఫ్రైడే అని, తిరిగి పునరుత్తానం చెందిన రోజు ఈస్టర్ అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని, ఆ ప్రభువు బోధనలు అనుసరిస్తే జీవితంలో శాంతి, సమాధానం దొరుకుతుందని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేట్ చేసి సంబురాలు చేసుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



కేక్ కట్ చేసి బీరప్పకు తినిపిస్తున్న నాయకులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్ పేయి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, పార్టీ మండల అధ్యక్షుడు సోమిరెడ్డి, నాయకులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, కూరెళ్ల వెంకట్‌రెడ్డి, పెండెం నాగేష్, దొంతుల చంద్రమౌళి, పెద్దటి కేశయ్య, సందెల రాము, పిట్టల ఎల్లయ్య, పురాణం రాంబాబు, వెంకటేష్, కొత్త శ్రీనివాస్, మంచాల రాజశేఖర్, పడిగల సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం

జనగామ రూరల్: పట్టణంలోని ఏసీ రెడ్డి నగర్‌లో మనుస్మృతి ప్రతులను కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లేర్ల లలిత ఆధ్వర్యాన సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుస్మృతి దేశంలో సామాజిక అసమానతలను సృష్టిస్తోందని అన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లమ్మ, ప్రేమలత, లక్ష్మి, సరిత, దేవేంద్ర, భానుప్రియ, మరియమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న మహిళలు

బాబోయ్ కోతులు

చిల్పూరు: చిల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో చిల్పూరు గుట్ట ఉంది. భక్తుల ఇలవేల్పు అయిన బుగులు వేంకటేశ్వర స్వామి కొలువై ఉంది కూడా ఇక్కడే. కానీ ఇక్కడ కోతుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండంతో భక్తులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల నుంచి రక్షణకు కిరాణం, హోటల్, ఇంటి యజమానులు ఇళ్లకు ఇనుప జాలీలు ఏర్పాటు చేసుకున్నారు. పెంకుటిళ్లు, రేకుల ఇళ్లపై ముళ్లకంప వేసుకున్నారు. గుట్ట కింద నివాసం ఉండే వారికి ఖాళీ స్థలాలు ఉన్నాయి. అందులో పూల మొక్కలు, కూరగాయల విత్తనాలు వేస్తే కొద్దిగా పెరగగానే కోతులు వాటిని పనికి రాకుండా చేస్తున్నాయి. కోతులను తరిమేందుకు వెళ్తే దాడులు చేయడంతో గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు చిల్పూరు ఆలయ కమిటీకి మొరపెట్టుకుంటే ఒకసారి వాటిని పట్టించగా తెల్లవారేసరికి మరిన్ని వచ్చి చేరాయి. దీంతో వారు కూడా చేతులెత్తేశారు. ఇళ్లకు జాలి డోర్లు లేని వారు తలుపులు ఎప్పుడూ మూసేస్తున్నారు. ఎవరైనా వస్తే తలుపు తీసే ముందు చేతిలో కర్ర పట్టుకోవాల్సిందే.



ఇంటి చుట్టూ ఏర్పాటు చేసుకున్న ఇనుప జాలీ, ఇంటిపై ముళ్ల కంప



కోతుల గుంపు

ఆరుబయట ఏదైనా పెడితే అంతే..



ఆరుబయట ఏ వస్తువైనా పెడితే అంతే. కోతులు వచ్చి పట్టుకెళ్తాయి. ఆ సమయంలో వాటిని తరిమితే మీదికి దూకుతాయి. అధికారులు స్పందించాలి.

– గొల్లపల్లి వాసు, హోటల్ యజమాని

జాలీలకు అదనపు ఖర్చు..



కోతుల బెడదకు దుకాణం చుట్టూ ఇనుప జాలీలు ఏర్పాటు చేసుకున్నాం. దీనికి అదనపు ఖర్చు చేయాల్సి వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి కోతుల నుంచి కాపాడాలి.

– జిల్లా సుష్మిత, వ్యాపారి